మొక్కజొన్న సాగు.. లాభాలు బాగు

- తక్కువ పెట్టుబడితోనే చేతికొస్తున్న పంట
- మెట్టలో ఆసక్తి చూపుతున్న రైతులు
- రహదారుల వెంబడి నేరుగా విక్రయాలు
- తప్పిన దళారుల బెడద

కిర్లంపూడి: రైతు ఆర్థికంగా నిలదొక్కుకొవాలంటే విభిన్న మార్గాలను అనుసరించాల్సిందే. సంప్రదాయ పంటలతో గిరి గీసుకునే కూర్చుంటే రైతుకు మిగిలేది అప్పులే. కాలానుగుణంగా మారుతూ ఆధునిక పద్ధతులు అవలంబిస్తూ అక్కడి పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగును ఎంచుకోవాలి. మెట్టప్రాంతంలో ఎక్కువగా వరి, చెరకు, అపరాలు సాగుచేసేవారు. మొక్క జొన్న పంటను చాలా అరుదుగా సాగుచేసే వారు. వాణిజ్య పంటలు వేయాలని వ్యవసాయశాఖ అధికారులు పదే పదే రైతులకు సూచించడంతో జగ్గంపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో వాణిజ్య పంటలు, అపరాలు, మొక్కజొన్న వేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. మొక్కజొన్న పంట తక్కువ పెట్టుబడితో తక్కువ సమయంలోనే మంచి ఆదాయాన్ని ఇవ్వడంతో ఎక్కువ మంది రైతులు మొక్కజొన్న సాగుపై మొగ్గు చూపిస్తున్నారు.

లాభాల బాటలో..

కాట్రావులపల్లి గ్రామంలోని రైతులు రబీ, ఖరీఫ్ సీజన్‌లో స్వీట్‌కార్న్ మొక్కజొన్న పండిస్తూ రైతులే స్వయంగా రహదారుల వెంబడి విక్రయాలు చేపడుతున్నారు. రైతులే నేరుగా దుకాణాలు పెట్టడంతో దళారుల బెడద లేకుండా అధిక లాభాలు ఆర్జిస్తున్నారు. నేరుగా రైతులే తాజా మొక్కజొన్న పొత్తులు అమ్మడంతో ప్రయాణికులు కొనేందుకు ఆసక్తి చూపుతున్నారు. వీటితో పాటు నియోజకవర్గంలోని ఎక్కువగా సీడ్స్ రకానికి చెందిన మొన్నజొన్న సాగు చేస్తున్నారు. ఇటీవల పలు సీడ్స్ కంపెనీలు రైతులకు రూ. 30 వేల వరకూ ముందస్తు రుణాలు, మూడు రకాల మందులు, విత్తనాలు ఇచ్చాయి. పంట చేతికొచ్చే వరకు ఆయా కంపెనీల సిబ్బంది పంటలను పరిశీలించి రైతులకు ఎరువుల యాజమాన్య పద్ధతులపై సూచనలు, సలహాలు ఇస్తున్నారు.



చిల్లంగిలో ఏపుగా ఎదిగిన మొక్కజొన్న పంట

పెట్టుబడి... రాబడి

రైతు మొక్కజొన్న సీడ్స్‌రకం విత్తనాలు నాటి పంట చేతికొచ్చే సరికి ఎకరాకు సుమారు రూ.40 వేలు ఖర్చవుతుంది. కాలం కలిసి వస్తే ఎకరాకు సుమారు 3 నుంచి 4 టన్నుల దిగుబడి వస్తుంది. విత్తన రకాన్ని బట్టి టన్నుకు రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు ధర పలుకుతుంది. పంటలు చేతికొచ్చిన తరువాత రైతుకు పెట్టుబడి ఇచ్చిన కంపెనీ ప్రతినిధులు పొలం వద్దకు వచ్చి మొక్కజొన్న కంకులు కొనుగోలు చేస్తారు. పంటల పెట్టుబడి నిమిత్తం రైతుకు సీడ్స్ కంపెనీ ఇచ్చిన రూ.30 వేలు తగ్గించుకుని మిగతా డబ్బులను ఆయా రైతులకు అందజేస్తారు.

నియోజకవర్గంలో మండలాల వారీగా మొక్కజొన్న సాగు వివరాలు

మండలం	సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)
గోకవరం	1500
కిర్లంపూడి	650
జగ్గంపేట	160
గండేపల్లి	558
మొత్తం	2686

సాగు పద్ధతులు..

పంట భూమిని విత్తే ముందు నాగలితో మూడు, నాలుగు సార్లు దుక్కి దున్నాలి. చివరి దుక్కులో ఎకరాకు సుమారు 10 టన్నుల బాగా మాగిన పశువుల పెంటను వేయాలి. తరువాత నాగలితో బోదె, కాలువలు చేసుకోవాలి. బోదెకు పైనుంచి మూడో వంతు ఎత్తులో విత్తాలి. దీని వల్ల నీటి పారుదల సులభంగా ఉంటుంది. వర్షపాతం ఎక్కువైనప్పుడు నీరు బయటకు పోయేందుకు వీలు కలుగుతుంది. మొలకెత్తిన పదిరోజుల తరువాత ఒత్తుగా మొలిచిన చోట బలంగా ఉన్న ఒక్కొక్క మొక్కను మాత్రమే ఉంచి అదనంగా ఉన్న మొక్కలను పీకి వేయాలి. కిలో విత్తనానికి 3 గ్రాముల మాంకోజెట్ లేదా కాప్టాన్‌తో విత్తన శుద్ధి చేసుకుంటే లేత దశలో మొక్కలను తెగుళ్ల బారి నుంచి కాపాడుకోవచ్చు.

అంతర కృషితో మంచి దిగుబడి



అంతర కృషి చేయడం వల్ల పంటలో దిగుబడి బాగుంటుంది. విత్తనాలు విత్తిన 30 రోజులకు పశువులతో లేదా, ట్రాక్టర్‌తో అంతర కృషి చేస్తే కలుపు మొక్కలను నివారించవచ్చు. తరువాత నత్రజని ఎరువులను వేసి వెంటనే బోదె నాగలిని నడిపితే కలుపు మొక్కల నివారణతో పాటు వేసిన ఎరువు పంట పెరుగుదలకు దోహదపడుతుంది.

–జోకా అమృత, కిర్లంపూడి మండల వ్యవసాయాధికారి

120 రోజుల్లోనే దిగుబడి



పలు విత్తనాల కంపెనీలు ముందస్తు పెట్టుబడి పెట్టడంతో ధైర్యంగా మొక్కజొన్న సాగు చేస్తున్నాం. మొక్కజొన్న విత్తనాల కంపెనీల ప్రతినిధులు రైతులకు ముందస్తుగా కొంత సొమ్ము పెట్టుబడిగా ఇస్తున్నారు. పంట చేతికి వచ్చాక నేరుగా పొలం వద్దకు వచ్చి కొనుగోలు చేయడం వల్ల రైతుకు మార్కెట్‌కు తీసుకువెళ్లి అమ్మే బాధలేదు. 90 నుంచి 120 రోజుల్లోనే పంటలు చేతికి రావడంతో రబీ సాగుకు ఇబ్బంది లేదు.

–శరకణం శ్రీను, రైతు, జగపతిగనగరం

క్లుప్తంగా

చేతికందే ఎత్తులో ప్రమాదం



బూరుగుపూడిలో ప్రమాదకరంగా ఉన్న ఫ్యూజ్

కిర్లంపూడి: మండలంలోని బూరుగుపూడి 4వ వార్డులో ప్రధాన రహదారిని ఆనుకుని విద్యుత్ స్తంభానికి ఉన్న ఫ్యూజ్ ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. దీని వద్ద బాక్స్ గాని, ఎటువంటి రక్షణ చర్యలు లేకపోవడంతో అటుగా రాకపోకలు సాగించేవారు ఆందోళన చెందుతున్నారు. ఇళ్లకు సమీపంలో ఉండడంతో పిల్లలు నిత్యం అక్కడే ఆడుకుంటున్నారు. ఫ్యూజ్ పిల్లల చేతికి అందే ఎత్తులో ఉండడంతో ఏ క్షణాన ఏ ప్రమాదం ముంచుకోస్తోందని స్థానికులు భయపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఫ్యూజ్ బాక్స్ ఏర్పాటు చేసి స్థంభానికి ఎత్తులో అమర్చాలని స్థానికులు కోరుతున్నారు.

ముద్రగడను కలసిన వైఎస్సార్ సీపీ నేతలు



కిర్లంపూడిలో ముద్రగడను కలసిన వైఎస్సార్ సీపీ నాయకులు

కిర్లంపూడి: శంఖవరం మండలం అన్నవరానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం కిర్లంపూడిలో మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం, వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి ముద్రగడ గిరిబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. కొండపల్లి అప్పారావు, ఎంపీటీసీ దడాల సతీష్, ఉపసర్పంచ్ బొబ్బిలి వెంకన్నబాబు తదితరులు ముద్రగడ గిరిబాబును కలిసి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నేతలు గుళ్ల ఆనంద్, అల్లాడ సూరిబాబు, ఈరంకి ఉదయ్, తాటిపాక కృష్ణ, పలివెల కొండలరావు పాల్గొన్నారు.

వైభవంగా గౌరీశంకరుల నిమజ్జనోత్సవం



ధర్మవరంలో సాంబశివుడు, గౌరీదేవిలను తలపై పెట్టుకొని మోస్తున్న భక్తులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరంలో గౌరీశంకరుల నిమజ్జనోత్సవం ఆదివారం కన్నులపండువగా జరిగింది. గ్రామంలో సుమారు మూడు నెలల పాటు గౌరీశంకరుల మహోత్సవాలు నిర్వహించారు. ఉత్సవాలు ముగియడంతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గౌరీశంకరులను ఆదివారం రామభద్రరాజు చెరువులో నిమజ్జనం చేశారు. శనివారం రాత్రి నుంచి ఆదివారం వేకువజాము వరకూ 101 శూలాలతో ప్రదర్శనలు, తీన్‌మార్ డ్యాన్స్‌లు, అఘోరా వేషధారణలు తదితర కళారూపాల నడుమ స్వామివారి ఊరేగింపు నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాల భక్తులు స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యం

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని జి.కొత్తపల్లి సర్పంచ్ ఈగల విజయదుర్గ అన్నారు. మండలంలోని జి.కొత్తపల్లిలో ఆదివారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడిక తీసి గ్రామం నలుమూలల బ్లీచింగ్ చల్లారు. వీధుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. వాటర్ ట్యాంకలను బ్లీచింగ్ వేసి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ విజయదర్గ మాట్లాడుతూ గ్రామం పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సూచించారు.

బాధితులకు నిత్యావసరాల పంపిణీ

తొండంగి: మండలంలోని పెరుమాళ్లపురం పంచాయతీ ఆవులమంద గ్రామంలో అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి కూటమి నేతలు ఆదివారం నిత్యావసరాలు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన అంబుజాలపు చంటియ్య ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయ్యి సర్వం కాలిపోయాయి. దీంతో కూటమి నాయకులు యనమల రాజేష్, కోడా వెంకటరమణ, చొక్కా అప్పారావు తదితరులు బాధితులకు నిత్యావసరాలు అందజేశారు.

నల్గొండమ్మతల్లికి బోనాల సమర్పణ



నల్గొండమ్మతల్లి

- వేలాదిగా దర్శించుకున్న భక్తజనం
- ఆకట్టుకున్న శోభాయాత్ర, సాంస్కృతిక కార్యక్రమాలు



నల్గొండమ్మతల్లికి వందలాదిగా బోనాలు తీసుకువెళుతున్న మహిళలు

తుని రూరల్: మండలంలోని ఎస్.అన్నవరంలో వేంపాడ మెట్టవద్ద కొలువైన నల్గొండమ్మ అమ్మవారికి ఆదివారం భక్తులు బోనాలు సమర్పించారు. ఆలయ అభివృద్ధి కమిటీ ప్రెసిడెంట్ వంగలపూడి దొరబాబు, కార్యదర్శి వంగలపూడి ఫణీంద్ర, కోశాధికారి వంగలపూడి జమీలు ఆధ్వర్యంలో అమ్మవారి బోనాలు పండగ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్.అన్నవరం, కొత్త సూరవరం గ్రామాలకు చెందిన వందలాది మంది మహిళలు బోనాలతో ఆలయం వరకు శోభాయాత్ర నిర్వహించారు. బోనాలు, నల్గొండమ్మతల్లికి ప్రీతికరమైన బెల్లం సమర్పించిన భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. తుని, సమీప గ్రామాల నుంచి తరలివచ్చిన వేలాది మంది భక్తులు క్యూలైన్లు ద్వారా అమ్మవారిని దర్శించి తరించారు. ఈ సందర్భంగా తప్పెటగుళ్లు, భజనలు, కోలాటం వంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పది వేల మందికి అన్నసంతర్పణ చేశారు. ఆలయ కమిటీ వైస్ ప్రెసిడెంట్ వంగలపూడి నాగు, కమిటీ ప్రతినిధులు వంగలపూడి కల్యాణ్, వంగలపూడి నాగేంద్ర, వైఎస్సార్ సీపీ, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.



వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించిన కళాకారులు

అమ్మవారి దర్శనానికి క్యూ కట్టిన భక్తులు

గండేపల్లి: కోరిన కోర్కెలు తీర్చే భక్తుల పాలిట కల్పవల్లిగా పేరుగాంచిన కనకదుర్గమ్మ అమ్మవారి దర్శనానికి భక్తులు క్యూ కట్టారు. మండలంలోని మురారి శివారు మామిడితోటల్లో వేంచిసిన అమ్మవారికి మొక్కులు తీర్చుకునేందుకు ఆదివారం పలు ప్రాంతాల నుంచి కుటుంబ సమేతంగా భక్తులు తరలివచ్చారు. హైవేకి సుమారు 4 కిలోమీటర్ల దూరం ఉన్నప్పటికీ దారి పొడవున భక్తుల రద్దీ నెలకొంది. సంక్రాంతికి సొంతూళ్లకు వచ్చిన బంధువులు, ఉద్యోగులు ఆటోలు, మినీ వ్యాన్లు, ట్రాక్టర్లు, ఇతర వాహనాలపై అమ్మవారి దర్శనానికి తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. స్థానిక సీఐ వైఆర్కే శ్రీనివాస్, ఎస్సై యువి శివ నాగబాబు, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.



మురారిలో అమ్మవారిని దర్శించుకునేందుకు క్యూ కట్టిన భక్తులు

తల్లికి పాదాభివందనం

కిర్లంపూడి: తల్లిదండ్రులను పూజిస్తే సకల లోకాల దేవతలను పూజించినట్టే..పుట్టిన నాటి నుంచి ప్రయోజకులం అయ్యేవరకు వారి జీవితాలను పణంగా పెట్టి, పిల్లల ప్రయోజనమే ధ్యేయంగా తీర్చేదిద్దే తల్లిదండ్రుల రుణం తీర్చుకోవడం సాధ్యం కాదు. ఆ తల్లి త్యాగానికి పాదపూజ చేసుకోవడం తప్ప ఆమె ప్రేమకు వెల కట్టడం ఎవరికీ సాధ్యం కాదు. మండల పరిధి కిర్లంపూడి మండలం రాజుపాలెం గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త గణేశుల రాంబాబు తన సోదరులు లచ్చబాబు, దొరబాబు, నాగబాబు, సోదరిమణులు చంద్రావతి, ఆదిలక్ష్మీతో కలిసి తమకు జీవితాన్ని ప్రసాదించిన తమ తల్లి గణేశుల రాజామణికి పూలతో పాదపూజ చేసి ఆ తల్లి ఆశీస్సులు తీసుకున్నారు. మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నాయకుడు ముద్రగడ పద్మనాభం దంపతులు ఆ కార్యక్రమానికి హాజరై వారిని అభినందించారు. ఈ సందర్భంగా ముద్రగడ మాట్లాడుతూ జన్మనిచ్చిన తల్లిపాదాలను పూజించుకోవడం ఎంతో అదృష్టమన్నారు.



తల్లి రాజామణికి పూలాభిషేకం చేసిన కుమారులు, కుమార్తెలు

భీష్మ ఏకాదశి ఏర్పాట్లపై సమీక్ష



భీష్మ ఏకాదశి ఏర్పాట్లపై అధికారులతో సమీక్షిస్తున్న దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ సుబ్బారావు

అన్నవరం: ఈ నెల 30న ప్రారంభమయ్యే మాఘ మాసం, వచ్చే నెల 8న భీష్మ ఏకాదశి పర్వదినం సందర్భంగా రత్నగిరిపై సత్యదేవుని ఆలయానికి వేలాదిగా భక్తులు వచ్చే అవకాశం ఉంది. ఈ మేరకు భక్తుల కోసం చేయాల్సిన ఏర్పాట్లపై ట్రస్ట్‌బోర్డు సమావేశ హాలులో ఆదివారం అధికారులతో దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ వి.సుబ్బారావు సమీక్షించారు. గతేడాది చేపట్టిన ఏర్పాట్లను వివిధ విభాగాల అధికారులు వివరించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని చైర్మన్, ఈఓ ఆదేశించారు. తదుపరి సమావేశం సమయానికి వివిధ విభాగాల అధికారులు తగిన ప్రణాళికలతో హాజరు కావాలని ఆదేశించారు. సమావేశంలో దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ రామ్మోహనరావు, ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యశర్మ, ఈఈ రామకృష్ణ, ఏఈఓలు జగ్గారావు, కొండలరావు, పీఆర్వో కృష్ణారావు, సూపరింటిండెంట్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రయాణికులతో ఆర్టీసీ బస్సుల రద్దీ



ప్రయాణికులతో రద్దీగా ఉన్న గోకవరం ఆర్టీసీ బస్టాండ్

గోకవరం: విద్యార్థులకు సంక్రాంతి సెలవులు ముగియడంతో తమ సొంత ప్రాంతాలకు వెళ్లే వారితో ఆర్టీసీ బస్సులు రద్దీగా మారాయి. గోకవరం ఆర్టీసీ డిపో నుంచి వెళ్లే బస్సులు ఆదివారం ప్రయాణికులతో కిక్కిరిసాయి. డిపో నుంచి రాజమహేంద్రవరం, కాకినాడతో పాటు ఏజెన్సీ ప్రాంతంలోని రంపచోడవరం, మారేడుమిల్లి, అడ్డతీగల ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులు ప్రయాణికులతో రద్దీగా వెళ్లాయి. ప్రయాణికుల సౌకర్యార్థం షెడ్యూల్ ప్రకారం ఆర్టీసీ అధికారులు బస్సు సర్వీసులను నడిపారు.

నేటి నుంచి పశు వైద్య శిబిరాలు

రౌతులపూడి: మండల పరిధిలోని గ్రామాల్లో సోమవారం నుంచి ఈ నెల 28 వరకూ పశువైద్య శిబిరాలు నిర్వహించనున్నట్టు మండల పశువైద్యాధికారి ఎం. వీర్రాఘవరావు తెలిపారు. ఈ శిబిరాల్లో ఆవులు, గేదెలు, దూడలు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ టీకాలు వేస్తారన్నారు. అనారోగ్యానికి గురైన పశువులకు చికిత్స చేయడంతో పాటు రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పిస్తారన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వైద్య శిబిరాల షెడ్యూల్ ఇలా..

మండలంలో పశువైద్య వైద్య శిబిరాల షెడ్యూల్‌ను పశువైద్యాధికారి ఎం. వీర్రాఘవరావు వివరించారు. తొలిరోజు సోమవారం ఎస్ఎస్‌పట్నం, ములగపూడి, 21న ఎస్.అగ్రహారం, రాజవరం, 22న లచ్చిరెడ్డిపాలెం, గంగవరం, 23న గిడజాం, ఎ.మల్లవరం, 24న రౌతులపూడి, బలరామపురం, 25న శృంగవరం, గుమ్మరేగుల, 27న చామవరం, ఎస్.పైడిపాల, 28న రాఘవపట్నం, పారుపాక గ్రామాల్లో శిబిరాలు నిర్వహిస్తామన్నారు. ఆయా గ్రామాల్లోని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రేపటి నుంచి పశువైద్య శిబిరాలు

ప్రత్తిపాడు: పశుపోషకులకు మెరుగైన సేవలు అందించేందుకు ఈ నెల 21వ తేదీ నుంచి 31 వరకు ప్రత్తిపాడు, ఏలేశ్వరం మండలాల్లోని ప్రతి గ్రామంలోనూ పశు వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్టు ప్రత్తిపాడు పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ చిక్కం బాలచంద్రయోగేశ్వర్ ఆదివారం తెలిపారు. శిబిరాల్లో భాగంగా భాగంగా పశువులను పరీక్షించి ఉచితంగా వైద్యం అందిస్తామన్నారు. తేలికపాటి శస్త్ర చికిత్సలు చేస్తామన్నారు. ఎదకు రాని, చూలు కట్టని, గర్భకోశ వ్యాధులకు పశువైద్యులతో పరీక్షలు చేయించి, తగు వైద్య అందిస్తామన్నారు. ఎదకు వచ్చిన పశువులను గుర్తించి, రైతన్నల ఇష్టం మేరకు లింగనిర్ధారిత వీర్యంతో కృత్రిమ గర్భధారణ చేయిస్తామన్నారు. పశువైద్య శిబిరాలు ముగిసిన తర్వాత పశుపోషకులకు శాస్త్రీయ పశు యాజమాన్య పద్ధతులు, పశు విజ్ఞానంపై అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. ప్రత్తిపాడు, ఏలేశ్వరం మండలాల్లో పశువైద్య శిబిరాల షెడ్యూల్‌ను ఆయన వెల్లడించారు. ఈ నెల 21న చింతలూరు, 22న పోతులూరు, 23న తోటపల్లి, సి.రాయవరం, 24న ఉద్దండ జగన్నాథపురం, గజ్జనపూడి, భద్రవరం, 25న పెద్దిపాలెం, సిరిపురం, తూర్పు లక్ష్మీపురం, 27న శరభవరం, పెద్దనాపల్లి, జడ్డంగి అన్నవరం, 28న ఉత్తరకంచి, తిరుమాలి, లింగంపర్తి, 29న ఒమ్మంగి, యర్రవరం, మర్రివీడు, 30న పేరవరం, ఏలేశ్వరం గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తామని వివరించారు. రైతులు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పడకేసిన పారిశుధ్యం



కోటనందూరు శివారు మల్లవరం సెంటర్‌లో పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలు

కోటనందూరు: మండల కేంద్రమైన కోటనందూరులో పారిశుధ్యం పడకేసింది. గ్రామంలో పారిశుధ్య నిర్వహణ అధ్వాన్నంగా ఉండటంతో ఎక్కడ చూసినా చెత్త కుప్పలే దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా గ్రామ పొలిమేర్లలో చెత్త, వ్యర్థాలు భారీగా పేరుకుపోయాయి. ఈ చెత్త కుప్పల్లో పందులు స్వైర విహారం చేస్తూ అపరిశుభ్ర వాతావరణాన్ని సృష్టిస్తున్నాయి. మరోపక్క మురుగు కాలువల్లో పూడిక తీయకపోవడంతో డ్రైన్లు పూడుకుపోయి నీరు ముందుకు కదలడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శివారు ప్రాంతాల్లో కాలువలు మురికి కూపాలను తలపిస్తున్నాయి. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా సత్యదేవుని నిత్యకల్యాణం



సత్యదేవుడు, అమ్మవార్లకు కల్యాణం నిర్వహిస్తున్న పండితులు చామర్తి కన్నబాబు, ఇంద్రగంటి బెనర్జీ

అన్నవరం: సత్యదేవుని నిత్యకల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్ల నిత్య కల్యాణం ఆదివారం ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి సెలవుల నేపథ్యంలో స్వామివారి ఆలయానికి వచ్చిన భక్తులు పెద్ద సంఖ్యలో కల్యాణంలో పాల్గొన్నారు. ఉదయం తొమ్మిది గంటలకు సత్యదేవుడు, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా నిత్య కల్యాణ మండపానికి తీసుకువచ్చారు. అక్కడ కల్యాణ వేదిక మీద ప్రతిష్ఠించి పూజలు చేశారు. అనంతరం అర్చకుడు ఇంద్రగంటి బెనర్జి, వ్రతపురోహిత సంఘం అధ్యక్షుడు, స్పెషల్ గ్రేడ్ వ్రతపురోహితుడు చామర్తి కన్నబాబు ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. సమారు 50 జంటలు స్వామివారి నిత్యకల్యాణంలో పాల్గొన్నాయి. దేవస్థానానికి రూ.55 వేల ఆదాయం సమకూరింది. స్వామివారి కల్యాణాన్ని యూట్యూబ్‌లో ప్రత్యక్ష ప్రసారం చేశారు.